సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 7 । జనవరి । 2024



ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన
ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. -8లో



వైభవం.. పుష్పరథోత్సవం
బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భాగంగా శనివారం పుష్పరథోత్సవం వైభవంగా నిర్వహించారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.9/20.9

జిల్లాలో శనివారం 20.9 - 30.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పరుగుపందెంలో ప్రతిభ



బంగారు పతకాన్ని చూపుతున్న హరిణి

పులివెందుల టౌన్: అనంతపురంలోని ప్రభుత్వ పాల్‌టెక్నిక్‌లో ఇంటర్ పాల్‌టెక్నిక్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఇందులో పులివెందుల లయోలా పాల్‌టెక్నిక్(వైఎస్‌ఆర్‌ఆర్) కళాశాలకు చెందిన హరిణి 100మీటర్ల పరుగు పందెంలో రాణించింది.బంగారు పతకం సాధించింది. తొండూరు మండలం గోటూరు గ్రామానికి చెందిన హరిణి కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరంచదువుతోంది.విద్యార్థినికి ప్రిన్సిపల్ బ్రిట్టో, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి ఖోఖోలో సత్తా



పతకం సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల: డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో ఉన్న డీఏవీ స్కూల్ విద్యార్థులు ఖోఖో క్రీడలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారని ప్రిన్సిపల్ శ్రీనివాస గుప్తా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతు ఈ నెల 3,4,5 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని గురుగ్రామ్‌లో జరిగిన పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారని రాణించారన్నారు.విద్యార్థులు, వ్యాయా ఆర్టీపీపీ సీఈ నాగరాజు, డీఏవీ ఆర్‌ఓ శేషాద్రి ప్రత్యేకంగా అభినందించారన్నారు. విద్యార్థుల గెలుపుకు ప్రధాన కారకుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు నరేష్‌ను అభినందించారు.


కడప గడపలో క్రికెట్ సందడి



వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం వేదికగా క్రికెట్ సంబరానికి రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిష్టాత్మకంగా భావించే కల్నల్ సీకే నాయుడు అండర్-23 బీసీసీఐ అంతర్ రాష్ట్రాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లు కడప గడపలో నిర్వహించనున్నారు. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు ఆంధ్రా జట్టు గోవా జట్టుతో తలపడనుంది. రెండో మ్యాచ్ ఆంధ్రా, చత్తీస్‌ఘర్ జట్ల మధ్య ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మూడో మ్యాచ్ ఫిబ్రవరి 18 నుంచి 21వ తేదీ వరకు ఆంధ్ర, రైల్వేస్ జట్ల మధ్య నిర్వహించనున్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ సంయుక్త సహకారంతో మ్యాచ్‌ల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీఏవైడీ అధ్యక్ష,కార్యదర్శులు ఎం. భరత్‌రెడ్డి, ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు.

మాస్టర్ ట్రైనర్లది కీలకపాత్ర



మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో మాస్టర్ ట్రైనర్లు కీలక పాత్ర పోషించాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మాస్టర్ ట్రైనర్లకు ఒకరోజు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఏడుగురు చొప్పున మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో 1941 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు జిల్లా వ్యాప్తంగా 58 మందిని మాస్టర్ ట్రైనర్లుగా ఎన్నుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ జేడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భరోసా.. భద్రత

- ఈ-శ్రమ్ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు
- అసంఘటితరంగ కార్మికులకు గుర్తింపు
- క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు (ఫైల్)


కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలోని ఈ-శ్రమ్ పథకం శ్రామిక జనావళికి ఆసరాగా నిలుస్తోంది. చిరు, వీధి వ్యాపారులకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ఈ పథకం రూపుదిద్దుకుంటోంది. క్షేత్రస్థాయిలోని కార్మికుల వివరాలను నమోదు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ విశేష కృషి చేస్తోంది. ఆధార్‌కార్డు తరహాలో దేశంలో ఎక్కడికి వెళ్లినా ప్రయోజనం చేకూరేలా యూనివర్సల్ అకౌంటు నంబరుతో కూడిన ఈ-శ్రమ్ గుర్తింపు కార్డును అందుకునేందుకు ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో అనధికారికంగా దాదాపు ఆరు లక్షల మందికి పైగా అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. వలస, అసంఘటిత రంగ, చిరు వ్యాపారులకు స్థానికత, సంఘటిత పరిస్థితులు ఉండవు. వీరికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది.

ఇవీ ప్రయోజనాలు

కార్మికులకు గుర్తింపు కార్డును జారీ చేస్తారు. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత కలుగుతుంది. కార్డు కలిగిన వారికి రూ. 2 లక్షల ప్రమాద బీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ. లక్ష ఆర్థికసాయం అందిస్తారు. విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటారు. వృత్తి నైపుణాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ కార్డు ఎంతో ఉపకరిస్తుంది. అసంఘటితరంగ కార్మికులు సామాజిక భద్రతా చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు నమోదు అవసరం. అలాగే ఆర్థికసాయం నేరుగా లబ్ధిదారుని ఖాతాకు జమ చేసే వీలుంటుంది.

అర్హులు వీరే!

18-59 సంవత్సరాల నిర్మాణ వలస కార్మికులు, ఇంటిపనివారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు,పశు పోషకులు, తోలు, వంద్రింగి, ఉప్పు, ఇటుక బట్టీల కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో రిక్షా కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు, షాపుల్లో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకానికి అర్హులు.



నమోదు ఎలా చేయాలంటే..

కార్మికుడు ఈ-పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. ఉచితంగా వివరాలు నమోదు చేసి యూనివర్సల్ అకౌంటు నంబరు గుర్తింపు కార్డును జారీచేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలో నమోదు చేసుకోవచ్చు.కార్మికుని ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు వివరాలు చెప్పాల్సి ఉంటుంది. కార్మికుడు ఎవరి వద్ద పనిచేస్తున్నాడో వెల్లడించాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నారో చెబితే సరిపోతుంది. పథకంలో ఒకసారి నమోదైతే చాలు...మళ్లీ రెన్యూవల్ చేయాల్సిన అవసరం లేదు. ఆ వివరాలు శాశ్వతంగా వెబ్‌సైట్‌లో ఉంటాయి.

వివరాలు నమోదు చేసుకోవాలి



జిల్లాలోని భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విషయంగా కార్మికులకు ఇప్పటికే తెలియజేశాం. ప్రతి ఒక్క కార్మికుడు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. - డి.డేనియల్, అధ్యక్షులు, భవన నిర్మాణ కార్మిక సంఘం, కడప

నిరంతర ప్రక్రియ



ఈ-శ్రమ్ నమోదు అనేది సంబంధిత కార్యాలయాల్లో నిరంతరంగా నమోదు చేస్తారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా కార్మికులు ఎవరైనా తమ వివరాలు నమోదు చేసుకోకుంటే సంబంధిత గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి.
- బి.శ్రీకాంత్‌నాయక్, కార్మికశాఖ అధికారి, కడప

పులివెందులకు మరోసారి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



ఎంపీకి అభినందనలు తెలుపుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి, చైర్మన్ తదితరులు

పులివెందుల టౌన్: పులివెందుల మున్సిపాలిటీకి వరుసగా రెండో ఏడాది స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు మాట్లాడుతూ లక్షలోపు జనాభా ప్రాతిపదికన, మౌలిక సదుపాయాలు, విశాలమైన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం, ఆట స్థలాలు, పార్కులు, పరిశుభ్రత విషయంలో అవార్డు దక్కడం గర్వకారణంగా ఉందన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల కృషి మరువ లేనిదన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో తోడ్పడిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు రావడానికి కృషి చేసిన పారిశుద్ధ్య సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో పులివెందులను ప్రపంచ స్థాయిలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు.

పాఠశాలకు రూ.10 లక్షల సాయం



విద్యార్థినికి ట్యాబ్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం: ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి మరోసారి దాతృత్వం చాటుకున్నారు. రాజుపాళెం మండలంలోని వెల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల పాఠశాల, కళాశాలకు శానిటేషన్ పైపులైన్లు, మరుగుదొడ్లు పాడైపోవడంతో గత కొద్ది రోజులుగా విద్యార్థినులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ, గోపాయపల్లె సర్పంచ్ జీరెడ్డి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. శనివారం 8వ తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థినులకు ఎమ్మెల్యే ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉన్న రూ.3.40 లక్షలతో పాటు తన సొంత నిధులు రూ.10 లక్షలతో పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో ప్రిన్సిపాల్ తులశమ్మ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సలోమి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, గౌతమ్‌రెడ్డి, రవి, పేరెన్స్ కమిటీ చైర్మన్ చిన్న ఓబులేసు పాల్గొన్నారు.

ఓటమే గెలుపునకు నాంది



విద్యార్థికి బహుమతి ఇస్తున్న కమిటీ సభ్యులు

కడప ఎడ్యుకేషన్: ఓటమే గెలుపునకు నాంది అని, ఎవరు కూడా ఓటమికి కుంగిపోకుండా ముందుకు సాగాలని వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో నిర్వహిస్తున్న కడప బాలోత్సవ కార్యక్రమం శనివారం ముగిసింది. బాలోత్సవ కమిటీ సభ్యులు లక్ష్మిరాజా, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, రాజశేఖర్ రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నేటి యువకులు ఆధునిక సాంకేతిక పేరుతో సెల్‌ఫోన్లకు బానిసలు అతున్నారన్నారు. పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచుతూ వారిలోని సృజనాత్మకతను, గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం 42 రకాల యాక్టివిటీస్‌లో పాల్గొని విజయం సాధించిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ నాగమునిరెడ్డి, కమిటీ సభ్యులు బాలఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్
- రాయచోటిలో 100 పడకల ఆసుపత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

రాయచోటి టౌన్: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జకియాఖానం పేర్కొన్నారు. రాయచోటిలో రూ.24.5 కోట్లతో నిర్మితమైన 100 పడకల ఆస్పత్రిని శనివారం వారు ప్రారంభించారు. జ్యోతిప్రజ్వలన చేసి ఆస్పత్రిలోని వార్డుల్లో కలియతిరిగి రోగులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వీరు మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో పేదవాడికి వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.

- రాయచోటి నియోజక వర్గ ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించిందని, 100 పడకల ఆస్పత్రి నిర్మితమైందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఈవిషయం గురించి గత ప్రభుత్వం పట్టించుకోలేదని, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎంతో సహకరించారని, అడిగిన వెంటనే ఆసుపత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతోపాటు వెంటనే నిధులు కూడా మంజూరు చేశారని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు తెలిపారు.
- రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం అన్నారు. రాయచోటిలో 100 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు.సీఎం ఆకాంక్ష మేరకు రోగులకు నాణ్యమైన వైద్యం అందించి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు కల్చరల్: కేసీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీపీ పుల్లయ్య జ్ఞాపకార్థం ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉపకారవేతనాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువు తున్న 500 మందికి ఉపకార వేతనాలకు అందించనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం 80శాతం పైగా మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. ఫిబ్రవరి 29లోగా కేసీ పుల్లయ్య ఫౌండేషన్.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకో వాలన్నారు. వివరాలకు 9949516637, 08564- 253866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సంక్రాంతికి స్పెషల్ బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ వ్యాప్తంగా అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ జిల్లాల నుంచి 797 స్పెషల్ సర్వీసులను నడపనున్నామని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. జోన్ వ్యాప్తంగా హైదరాబాద్ 286, బెంగళూరు 268, చెన్నై 43, విజయవాడ 72, ఇతర నగరాలకు 128 సర్వీసులు చొప్పున మొత్తం 797 బస్సులు నడపనున్నామని వివరించారు. ఈ బస్సులను ఈనెల 10వ తేదీ నుంచి నడపనున్నట్లు తెలియజేశారు.

- అనంతపురం నుంచి హైదరాబాద్‌కు 37, బెంగళూరుకు 37, చెన్నై 7, విజయవాడ 10, ఇతర నగరాలకు 11 బస్సులు చొప్పున మొత్తం 102 బస్సులను నడపనున్నారు.
- అన్నమయ్య జిల్లా నుంచి హైదరాబాద్‌కు 5, బెంగళూరు 17, విజయవాడ 6 కలిపి మొత్తం 30 సర్వీసులు నడవనున్నారు.
- చిత్తూరు జిల్లా నుంచి హైదరాబాద్‌కు 1, బెంగళూరు 57, విజయవాడ 2, ఇతర నగరాలకు 13 సర్వీసులు చొప్పున మొత్తం 73 బస్సులు నడుస్తాయి.
- కర్నూలు జిల్లా నుంచి హైదరాబాద్‌కు 48, బెంగళూరు 25, చెన్నై 2, విజయవాడ 11, ఇతర జిల్లాలకు 6 చొప్పున మొత్తం 92 సర్వీసులు నడుస్తాయి.
- నంద్యాల జిల్లా నుంచి హైదరాబాద్‌కు 67, బెంగళూరు 03 కలిపి మొత్తం 70 సర్వీసులు నడుస్తాయి.
- సత్యసాయి జిల్లా నుంచి హైదరాబాద్ 25, బెంగళూరు 19, చెన్నై 5, విజయవాడ 7, ఇతర నగరాలకు 14 చొప్పున మొత్తం 70 సర్వీసులు నడపనున్నారు.
- తిరుపతి జిల్లా నుంచి హైదరాబాద్‌కు 15, బెంగుళూరు 40, చెన్నై 17, విజయవాడ 11, ఇతర నగరాలకు 59 కలిపి మొత్తం 142 సర్వీసులు నడుస్తాయి.
- వైఎస్సార్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు 88, బెంగుళూరు 70, చెన్నై 10, విజయవాడ 25, ఇతర నగరాలకు 25 కలిపి మొత్తం 218 సర్వీసులు నడపనున్నారు.

పకడ్బందీగా 'ఆడుదాం ఆంధ్ర'

కడప సెవెన్‌రోడ్స్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో ప్రణాళిక మేరకు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తితోపాటు మానసిక నైపుణ్యాన్ని పెంచేందుకు అన్ని వయస్సుల వారికి ఆడుదాం ఆంధ్ర నిర్వహిస్తోందన్నారు. బాధ్యతగా అన్ని దశలు పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన క్రీడల రిపోర్టుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో తాత్సారం వహించిన అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని, క్రీడలను వీక్షించేందుకు స్థానికులను ప్రోత్సహించాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుగుతున్నాయో, లేదో పరిశీలించాలన్నారు.



వైభవం.. పుష్పరథోత్సవం


పుష్పరథంలో ఆశీనులైన శ్రీఈశ్వరీదేవి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవిమఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. నాలుగో రోజైన శనివారం పుష్పరథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోకమాత పుష్పరథంపై ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. జగజ్జననికి మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించారు. గుడి ఉత్సవం చేపట్టారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా అనుమసముద్రం మండలం కొలను గ్రామానికి చెందిన భువనేశ్వర్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. నరసనపల్లె బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి పాదరేణువులు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అలరించిన సంగీత విభావరి

తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీఅన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు నిర్వహించిన సంగీత విభావరి భక్తులను అలరించింది. శెట్టివారిపల్లెకు చెందిన శ్రీరామాంజనేయ మహిళా బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మఠం సిబ్బంది, అమ్మవారి శిష్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన గుంటమక్కల వెంకటేశ్వరరావు, వైజాగ్‌కు చెందిన గోపిశెట్టి సురేంద్రనాథ్, కడపకు చెందిన మునగా బద్రినాథ్ శ్రేష్ఠి, ప్రకాశం జిల్లా కంభంకు చెందిన తిరువీధి లక్ష్మీరంగయ్యశ్రేష్ఠి, బ్రహ్మంగారి మఠం ముక్కమల్ల భాస్కర్‌రెడ్డి, చెరువుపల్లి ఓంకారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినియోగిత సేవల చట్టాలపై అవగాహన


మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ప్రజా వినియోగిత సేవల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నాగరాజుపేటలోని సీఎస్ఎస్ స్కూల్ మీటింగ్ హాల్‌లో శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యంలో ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై విద్యాశాఖ డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, డీఈఓ సిబ్బంది, సమగ్రశిక్ష సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓలు, కడప ఎంఈఓ పాలెం నారాయణ, పర్మనెంట్ లోక్ అదాలత్ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, ఆదినారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాకీ జిల్లా జట్టు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో శనివారం జిల్లా స్థాయి హాకీ జూనియర్ విభాగం జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హాకీ కడప అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి ప్రెసిడెంట్ ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా జట్టు ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించనున్న ఏపీ బాలుర జూనియర్ అంతర్ జిల్లాల హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హాకీ కడప సెలక్షన్ కమిటీ సభ్యులు ఎం.శేఖర్, సీనియర్ కోచ్ ఆకుల రమేష్‌బాబు, క్రీడా పాఠశాల హాకీ శిక్షకులు అనిల్‌కుమార్, ఖాదర్‌బాషా, అసోసియేషన్ ప్రతినిధులు విలియంరాజ్, ప్రవీణ్‌కిరణ్, ఖాదర్‌మోహిద్దీన్, ఉదయ్‌దీపు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె : చెన్నూరు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న 300 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. బుగ్గ అగ్రహారం సమీపంలో ఐచర్ వాహనంలో తరలిస్తుండగా విజిలెన్స్ సీఐ హిందూ బాషా, ఏవో బాలగంగాధర్‌రెడ్డి, సిబ్బంది అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారు. వాహనంతోపాటు బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీరబ్రహ్మయ్య, హరికృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

ముళ్లకంపల దారి.. శిథిలావస్థ గదులు.. పెచ్చులూడుతున్న పై కప్పు.. తలుపులు లేని మరుగుదొడ్లు.. తాగునీటి కొరత.. తరగతి గదిలో కిందనే కూర్చోవాల్సి ఉండటం తదితర అసౌకర్యాలు.. నాడు ప్రభుత్వ పాఠశాలల్లో దర్శనమిచ్చేవి. దీంతో విద్యార్థుల సంఖ్య నానాటికీ దిగజారిపోయేది. కానీ నేడు పరిస్థితి మారిపోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మనబడి నాడు- నేడు కార్యక్రమం ద్వారా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఇందుకోసం భారీగా నిధులు వెచ్చించింది. కార్పొరేట్ స్కూళ్లను మించి వసతులను కల్పించింది.. భారీ భవంతులు.. పటిష్ట తరగతి గదులు.. రక్షణగోడ, ముఖద్వారం.. ఆకర్షిస్తున్న రంగులు.. విజ్ఞానం పెంచే చిత్రాలు.. అధునాతన బెంచీలు.. సౌకర్యాల మరుగుదొడ్లు.. ఆహ్లాదకర ప్రాంగణం.. ఆటస్థలం.. శుద్ధినీరు... ఇలా ఎన్నో సౌకర్యాలతో అలరారుతున్నాయి. దీంతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల వైపు అడుగులు వేస్తున్నారు. - సాక్షి, నెట్‌వర్క్

నాడు | నేడు




వేంపల్లె: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల




ప్రొద్దుటూరు కల్చరల్: హోమస్‌పేట ప్రాథమిక పాఠశాల




సిద్దవటం: భాకరాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



కడప ఎడ్యుకేషన్ : చెమ్ముమియాపేట ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



కమలాపురం : టి.చదిపిరాళ్లలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల

ఎన్నికలకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి




మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్ : రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాళికబద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఎంపిక చేసిన సిబ్బందికి 'సెక్టార్ పోలీస్ ఆఫీసర్స్' శిక్షణా కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఉమేష్‌చంద్ర స్మారక పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో ప్రారంభించారు. ఈ సందదర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ప్రవీణ్‌కుమార్, ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌డే

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో 'పోలీస్ గ్రీవెన్స్‌డే' నిర్వహించారు.

కారు ఢీకొని ఒకరి దుర్మరణం


మృతి చెందిన మహబూబ్‌బీ

దువ్వూరు : మండలంలోని ఇడమడక వద్ద ఉన్న కడప-కర్నూలు జాతీయ రహదారిపై శనివారం స్కూటర్, కారు ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇడమడక గ్రామానికి చెందిన మహబూబ్‌బీ(74) కూరగాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తుండేది. ఈమెకు భర్త, పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో దువ్వూరులోని గోరి స్వామి దర్గా వద్ద కూరగాయలు కొనుగోలు చేసిన ఆమె నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన పుల్లయ్య అనే వ్యక్తి స్కూటర్‌లో తిరిగి వస్తుండగా కడప నుంచి నంద్యాలకు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బీ అక్కడికక్కడే మృతి చెందగా, పుల్లయ్యకు కాలు విరిగింది. గాయపడిన పుల్లయ్యను నంద్యాల చిల్లా చాగలమర్రి కేరళ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (48) మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగంపేట జాతీయ రహదారిలోని హ్యాపీడేస్ దాబా హోటల్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మృతుడి తల పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో వ్యక్తిని గుర్తు పట్టలేకపోతున్నామన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పరిధిలోని గుండాల బీటువద్ద ఎర్రచందనాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి ఎనిమిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి తెలిపారు. నిందితుడు ఏలుమల్లయ్యగా గుర్తించినట్లు పేర్కొన్నారు. దుంగలు 152 కేజీలు ఉన్నాయని, నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు వివరించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

ముద్దనూరు : స్థానిక కొత్తకొట్టాల వీధిలో రాజు(25) అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కొండేపల్లె గ్రామానికి చెందిన రాజు సుమారు 5 నెలల క్రితం స్థానిక కొత్తకొట్టాల వీధికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి రాజు ముద్దనూరులోనే వున్నాడు. శుక్రవారం మండలంలోని నల్లబల్లె గ్రామ సమీపంలోని ఓ వంకలో పురుగుల నివారణ మందు తాగి పడిపోయి ఉండటంతో పోలీసులకు సమాచారం వచ్చింది. అపస్మారక స్థితిలో వున్న అతన్ని చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మరణించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడికి అరెస్ట్ వారెంట్ జారీ

మైదుకూరు : కాశినాయన మండలం శాంతినగర్‌కు చెందిన చెంచుల విజయ్‌కుమార్ అలియాస్ రాబర్ట్ అనే నిందితుడికి అరెస్టు వారెంట్ జారీ అయినట్టు మైదుకూరు అర్బన్ ఎస్ఐ ఘన మద్దిలేటి శనివారం తెలిపారు. ఓ చోరీ కేసులో నిందితుడు కోర్టుకు హాజరు కానందున ప్రొద్దుటూరు అదనపు జిల్లా కోర్టు అతనికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందన్నారు. నిందితుడు ఈనెల 18వ తేదీలోపు ప్రొద్దుటూరు కోర్టు ఎదుట కానీ, మైదుకూరు పోలీసుల ఎదుట కానీ హాజరు కావాలని పేర్కొన్నారు. లేదంటే కోర్టు తీసుకునే చట్టపరమైన చర్యలకు నిందితునిదే బాధ్యత అని ఎస్ఐ తెలిపారు.

మోటార్ల వైర్లు చోరీ

అట్లూరు : మండల పరిధిలోని వ్యవసాయ పొలాల్లో మోటార్ల రాగివైర్ల చోరీలు అధికమయ్యాయి. శుక్రవారం రాత్రి అట్లూరు గ్రామానికి చెందిన ఆరెళ్ల సూర్యనారాయణ, పొడమేకల రవి, మాచునూరు వీరారెడ్డిల పొలాలలోని వ్యవసాయ మోటార్లకు సంబంధించిన రాగివైర్లను దొంగలించారు. ముందురోజు వరికుంట, అట్లూరు క్రాస్ రోడ్డులోని పలువురి రైతులకు చెందిన మోటార్ల రాగివైర్లను అపహరించారు. రెండు నెలల క్రితం తంభళ్లగొంది పంచాయతీ పరిధిలోని సోమేశ్వరపురం రైతులు స్వయంగా ట్రాన్సుఫార్మర్ల దొంగలను పోలీసులకు పట్టించారు. అయినా దొంగతనాలు ఆగడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇంటి మంజూరుతో ఎంతో ఆనందం



జగనన్న కాలనీలో నాకు ఇల్లు రావడం ఎంతో ఆనందంగా ఉంది. పులివెందుల పట్టణంలోని రాజీవ్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. గత ప్రభుత్వాల హయాంలో అనేక మార్లు ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నా నాకు ఇల్లు రాలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో మాకు ఇల్లు మంజూరు చేశారు.

– హేమ, రాజీవ్ కాలనీ, పులివెందుల

మా బతుకులో మార్పు వచ్చింది



మాది బద్వేలు మున్సిపాలిటీలోని అగ్రహారం గ్రామం. నా భర్త ఆటో నడపడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తుండేవాళ్లం. చాలీచాలని ఆదాయంతో పిల్లల చదువుకు, కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతుండేవాళ్లం. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం వచ్చాక మా బతుకులో మార్పు వచ్చింది. నా కుమార్తెకు అమ్మఒడి కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తున్నారు. అలాగే నా భర్తకు వాహనమిత్ర ద్వారా ఏడాదికి రూ.10 వేలు ఇస్తున్నారు. మాకు ఇల్లు కూడా మంజూరైంది.

– మోడెంగురు భాగ్య, అగ్రహారం, బద్వేలు